క్లుప్తంగా

ఈ పంట నమోదు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

సీతానగరం: మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలన్నింటినీ ఈ పంట నమోదు చేయించుకోవాలని ఏవో ఎస్.అవినాష్ అన్నారు. పెదబోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో సుగర్‌కేన్ గ్రోయర్స్ సొసైటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన రైతులకు ఈ పంట నమోదు, ఎరువుల వాడకం అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బహుళ ప్రయోజనాలున్న ఈ పంట నమోదులో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. కృష్ణారాయపురంలో వ్యవసాయ సహాయకుడు వాసు రామమందిరం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న శక్తి యాప్ ఇన్‌చార్జి శ్రీరాములు

సీతానగరం: మహిళల ఆత్మ రక్షణకు ప్రాధాన్యతనిస్తూ తెచ్చిన చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని శక్తి ఇన్‌చార్జి శ్రీరాములు అన్నారు. మండలంలోని బగ్గందొరవలస జంక్షన్‌లోని కృషి విద్యాలయంలో మహిళల ఆత్మరక్షణపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ప్రతి విద్యార్థిని శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక అవస్థలు



మండుటెండలో గంటల తరబడి నిరీక్షిస్తున్న మహిళలు

సీతానగరం: మండల కేంద్రంలో బస్సుల కోసం వేచి ఉండే వారి కోసం షెల్టర్ లేకపోవడంతో మహిళలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన కూటమి ప్రభుత్వం అందుకు తగ్గ ఆర్టీసీ సర్వీసులను తిప్పడం లేదు. దీంతో బస్సుల కోసం మహిళలు గంటల కొద్దీ బస్ స్టాప్‌ల వద్ద వేచి ఉండాల్సి వస్తుంది. అయితే ఈ నిరీక్షణ సమయంలో ఎటువంటి షెల్టర్ లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం

కొమరాడ: మండల కేంద్రానికి చెందిన గుత్తావల్లి సురేష్ కుమార్తె జి. చిన్నారి ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మజ్జిగౌరి ఆటో యూనియన్ నాయకులు గోపి, శ్రీను, తదితరులు రూ. ఐదు వేలు పోగుచేసి చిన్నారి తల్లిదండ్రులకు గురువారం అందజేశారు. ఆపదలో ఉన్న తోటి డ్రైవర్‌ను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ఆర్థిక సాయం చేసినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

సాగులో తస్మాత్...



పొలంలో మందు స్ప్రే చేస్తున్న రైతు

బలిజిపేట:

వ్యవసాయ సాగులో క్రిమి సంహారక మందుల వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. పంటల సాగులో ఎరువులు, మందులను పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగు సూచనలు చేస్తున్నారు.

రసాయనాలతో అనారోగ్య సమస్యలు

పంటలను ఆశించే చీడపీడల నివారణకు రైతులు క్రిమి సంహారక మందులు వేస్తుంటారు. జాగ్రత్తలు పాటించకపోతే అనారోగ్య సమస్యలకు మార్గం సుగమమయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. క్యాన్సర్, గుండె జబ్బులు, కళ్లు తిరగడం, వాంతులు, నరాల బలహీనత వంటి వాటికి లోనయ్యే ప్రమాదముంది. మందులు పిచికారీ చేసే వ్యక్తులకే కాకుండా మందుల వాడకం వల్ల వాటి అవశేషాలు పంటలపై చాలా కాలంగా ఉండి వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురవుతారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండే దుస్తులు ధరించాలి. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించాలి. పిచికారీ చేసే సమయంలో పొగ, నీరు తాగడం, భోజనం చేయరాదు. పిచికారీ మందు కోసం వాడే స్ప్రేయర్లు కండిషన్‌లో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలి. పురుగు, తెగుళ్ల మందులను కలిపేటప్పుడు చేతులతో కాకుండా కర్రతో కలపాలి. ఆహార పదార్థాలతో పాటు కీటక నాశక మందులను రవాణా చేయరాదు. పురుగు మందుల డబ్బాలను పిల్లలకు అందకుండా ప్రత్యేక గదిలో ఉంచాలి. పురుగు మందులు వినియోగించే ముందు వాటిపై వివరాలను బాగా పరిశీలించాలి. డబ్బాలపై రంగు ముద్రలను కూడా పరిశీలించాలి. గాలి వీచే దశలోనే మందు ద్రావణం పిచికారీ చేయాలి. నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదరాదు. ప్రమాదవశాత్తూ మందు కళ్లలో పడితే వెంటనే మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. కీటక నాశక మందుల డబ్బాలను ఖాళీ అయిన వెంటనే గొయ్యి తీసి అందులో పూడ్చిపెట్టాలి. పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రపరచుకోవాలి. ప్రమాదవశాత్తు విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్స అందించి, డాక్టర్‌ను సంప్రదించాలి. పురుగు మందుల వివరాలను డాక్టర్‌కు తెలియపరచాలి. పిచికారీ పూర్తయిన అనంతరం స్ప్రేయర్ల ట్యాంక్ బయట, లోపల శుభ్రంగా కడిగి వాటి భాగాలకు ఇంజన్ ఆయిల్ పట్టించి జాగ్రత్తపరచాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

"వ్యవసాయ పంటల్లో పిచికారీ చేసేటప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలి. మాస్క్ ధరించాలి, ప్రత్యేక జాకెట్ వేసుకోవాలి. తినుబండారాలు తినకూడదు. ఉదయం 10లోపు, సాయంత్రం పిచికారీ చేయాలి. ఎరువులు, మందులు తగు మోతాదులో వినియోగించాలి. తెగుళ్లను గుర్తించి వాటికి అవసరమైన మందులు మాత్రమే వినియోగించాలి."

– శివగణేష్, ఏవో, బలిజిపేట

- క్రిమి సంహారక మందుల వాడకంలో అప్రమత్తత అవసరం
- స్ప్రే చేసేటప్పుడు తగు జాగ్రత్తలు అవసరం

సేంద్రీయ సాగు విధానం మేలు

సేంద్రీయ సాగు విధానాన్ని అనుసరించడం వలన నేలలో సారం ఎక్కువగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందవచ్చు. పశువుల వ్యర్థాలు, వేపాకు కషాయం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్టు వంటివి వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుంది. మందులు ఎక్కువగా వినియోగించడం వలన కీటకాల వ్యాధి నిరోధక శక్తిని పొందుతాయి. దీనివలన పంటకు నష్టం వాటిల్లుతుంది.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీడీ పీవో డాక్టర్ జగన్‌మోహన్

పార్వతీపురం టౌన్: క్యాన్సర్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. ఎన్‌సీడీ 4.0 లో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై సీహెచ్‌వో, ఏఎన్‌ఎంలకు గురువారం ఎన్జీవో హోంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్ డా.శోభారాణి, డెంటల్ వైద్యులు డా.సుకత పవర్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌లో ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ లక్షణాలను ముందుగానే వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో గుర్తించాలని, అనంతరం వైద్యాధికారి ద్వారా నిర్దేశించిన అంకాలజీ విభాగానికి తుది నిర్ధారణకు రిఫర్ చేయాలన్నారు. సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే క్యాన్సర్ ముప్పు తప్పుతుందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా ఎన్‌సీడీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వైద్య తనిఖీలు, పరీక్షలతో క్యాన్సర్ అనుమానిత లక్షణాలను వైద్య సిబ్బంది ఎలా గుర్తించాలి, తదుపరి కార్యాచరణపై శిక్షణలో వివరించిన అంశాల్ని క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరిపి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే బీపీ, షుగర్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పర్యవేక్షణ చేయాలన్నారు.

యూటీఎఫ్ రణభేరి పోస్టర్ విడుదల



రణభేరి పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సాలూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి పోస్టర్‌ను ఆ సంఘ నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బోడెల విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు రూ.15వేలు కోట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులను బోధనేతర పనులకు కాకుండా విద్యా బోధనకు మాత్రమే వినియోగించాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి ఎ.గణేష్, జిల్లా కార్యదర్శి జానకీరావు, మండల శాఖ అధ్యక్షుడు సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక మండల కమిటీ నాయకులు ఇన్‌చార్జి ఎంపీడీవో కె.కుమారవర్మకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కమిటీ నాయకులు టి.క్రాంతికుమార్, శశిభూషణ్, ఎంపీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టామని తెలిపారు. 15 రోజుల్లోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామని తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న గ్రామానికి చెందిన వాటక భాగల అనే గిరిజనుడు 52 రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబీకులు ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై బి.శివప్రసాద్ మాట్లాడుతూ..వృద్ధుడు మూగ, చెవిటి వాడని.. జూలై 21న గ్రామానికి దగ్గర్లో ఉన్న కొమరాడ మండలం కూనేరు సంతకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. సమీప గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని చెప్పారు. తప్పిపోయిన వ్యక్తి ఎవరికి కనిపించినా 94919 06485, 79812 96171 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

పాలకొండ రూరల్: తమ భూముల్లో దౌర్జన్యంగా చొరబడి పంటలు నాశనం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని జియ్యమ్మవలస మండలం గడిసింగుపురం పంచాయతీ పరిధిలోని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గడసింగుపురం, ఏనుగులగూడలకు చెందిన గిరిజనులు 15 ఏళ్లుగా ఆ ప్రాంతాల్లోని 40 ఎకరాల్లో సేద్యం చేస్తున్నారన్నారు. ఈ మొత్తం భూమిలో 30 ఎకరాలకు డీ పట్టా అందించినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో సంతనర్సిపురం గ్రామానికి చెందిన కె.పార్వతమ్మ, కె.జయలలిత, చిన్నమ్మలు, జి.గౌరమ్మ, వి.రాములు, జి.జగన్నాథం, అలివేలుతో పాటు మరి కొంతమంది తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు స్థానిక మండల అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. జీడి, పత్తి మొక్కలను ఈ నెల 9న పూర్తిగా ధ్వంసం చేసినట్లు అధికారులకు వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఎలుగుల కొండను కాపాడుకుంటాం..



హెచ్‌కారాడవలస వద్ద ఎలుగుల కొండను పరిశీలించిన ప్రజా సంఘాల నాయకులు

- ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్: మండలంలోని హెచ్‌కారాడవలస – పెదబొండపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న ఎలుగుల మెట్టపై మైనింగ్ తవ్వకాలు అనుమతులు రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎలుగుల కొండను కాపాడుకునేందుకు స్థానిక గ్రామాల ప్రజలు, రైతులతో పోరాటం చేస్తామన్నారు. ఈ మేరకు ఎలుగుల కొండ మెట్టను ప్రజా సంఘాల నాయకులు గురువారం సందర్శించారు. మైనింగ్ తవ్వకాలు మెట్టపై జరిగితే వందలాది ఎకరాల పంట భూములు నష్టపోవడమే కాకుండా ప్రజలు, ముఖ్యంగా పశువుల పెంపకందారులు ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తుతాయన్నారు. మెట్టపై తవ్వకాలకు ఇటీవల వెంకటసాయి గ్రానైట్స్ యాజమాన్యానికి అనుమతులు జారీ కావడంతో అధికారులు తూతూమంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేశారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా రైతులకు, ప్రజలకు, వ్యవసాయ భూములకు నష్టం కలిగించే మైనింగ్ తవ్వకాలను ప్రారంభించాలని చూస్తే ఈ ప్రాంత రైతులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. పరిశీలనలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ కుమార్, ఈవీ నాయుడు, సింహాద్రి దుర్గారావు, సీపీఐ లిబరేషన్ నాయకులు సంగమేశ్వరరావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, సంతోష్, సీతారాం, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ ఏచూరి వర్ధంతి



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీతానగరం: కార్పొరేట్, ప్రైవేటీకరణ, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు ఎర్ర జెండానే ఆయుధంగా మలుచుకుని పోరాటం చేసిన జాతీయ స్థాయి పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా నాయకుడు ఆర్.వేణు అన్నారు. మండల కేంద్రంలోని ఏచూరి వర్ధంతిని పార్టీ మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ దోపిడీ, వివక్ష, పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థ రూపు మాపేందుకు జీవితాంతం పోరాటం చేశారన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్.సత్యనారాయణరెడ్డి, రెడ్డి లక్ష్మున్నాయుడు, వై.రామారావు, బి.అప్పారావు, సీహెచ్ కృష్ణ, రమణమూర్తి, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల నిరసన



పార్వతీపురం రూరల్: నర్సిపురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

సాలూరు: తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఉపాధ్యాయుల నిరసన కొనసాగుతుంది. పట్టణం, మండలంలో పలువురు ఉపాధ్యాయులు ఏపీటీఎఫ్ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై భోజన విరామ సమయంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్, పీఆర్‌సీలను కనీసం పట్టించుకోవడం లేదని, బకాయిలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. తమ ఆందోళనలో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

పార్వతీపురం రూరల్: ఏపీటీఎఫ్ పిలుపు మేరకు జిల్లాలోని ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధన కోసం గురువారం నుంచి నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతున్నట్లు స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని నర్సిపురంలో ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి నల్ల బ్యాడ్జీలు ధరించి సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారం చేయకపోతే మరింత తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వివిధ రూపాల్లో ఈ నిరసన ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటనాయుడు, రమేష్, అరుణ, బీవీఆర్‌కె, పట్నాయక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పీఏసీఎస్‌లు



వీరఘట్టం వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘ కార్యాలయం

- పాలకొండ నియోజకవర్గంలో జరగని త్రీమెన్ కమిటీ నియామకాలు
- పాలక మండళ్లు లేక గాడి తప్పుతున్న పాలన
- ఖరీఫ్‌లో రైతులకు అందని సహకార సంఘాల సేవలు

వీరఘట్టం:

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో త్రీమెన్ కమిటీ నియామకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. దీంతో రైతులకు సరైన సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) అప్పటి వరకున్న త్రీమెన్ కమిటీలను రద్దు చేసింది. తర్వాత వారి అనుచరులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసుకుంది. ఇందులో భాగంగా ఆరు నెలల కిందట పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లోని పీఏసీఎస్‌ల్లో మాత్రం త్రీమెన్ కమిటీలను నియమించారు. ఒక్క పాలకొండ నియోజకవర్గంలో ఉన్న 8 సొసైటీలలో ఇంత వరకు కమిటీలను వేయకపోవడంతో పాలన గాడి తప్పుతోంది. పాలకొండ నియోజకవర్గంలో ఏడాదిగా ప్రత్యేకాధికారుల పాలనతో సహకార సంఘాలు నడుస్తుండం.. పీఏసీఎస్‌ల్లో పాలక మండళ్లు లేకపోవడంతో రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు వంటివి అందకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. జిల్లా అంతటా త్రీమెన్ కమిటీల నియామకం పూర్తయినా, ఒక్క పాలకొండ నియోజకవర్గంలో ఇంకా వేయకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే . పీఏసీఎస్‌ల్లో నామినేటెడ్ పదవుల కోసం ఆశిస్తున్న వారు ఆ పదవుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

రైతులకు అందని ఎరువులు...

వీరఘట్టంలో ఉన్న పీఏసీఎస్‌కు ఈ ఏడాది ఒక లారీ లోడ్ యూరియా వచ్చింది. ఈ లారీని ఓ టీడీపీ నేత తరలించుకుపోవడంతో మిగిలిన రైతులకు యూరియా అందలేదు. దౌర్జన్యంగా ఆ లారీ యూరియాను తరలించుకుపోవడంతో తర్వాత సొసైటీ అధికారులు యూరియా తెప్పించేందుకు వెనుకడుగు వేశారు. గతంలో పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందేవి. ఇప్పుడు పాలకమండళ్లు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారులు యూరియా తీసుకువచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. అటు ఆర్‌ఎస్‌కేలకు యూరియా రాకపోవడం, సొసైటీలకు యూరియా తెచ్చే అవకాశం ఉన్నా ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది పాలకొండ నియోజకవర్గంలో పీఏసీఎస్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పాలక మండళ్లను నియమించి సొసైటీ సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సొసైటీ ఉన్నా ఉపయోగం సున్నా..



వీరఘట్టంలో సొసైటీ ఉన్నా దాని వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేదు. కనీసం ఒక యూరియా బస్తా కూడా సామాన్య రైతులకు అందడం లేదు. ఈ సీజన్‌లో ఒక్క లారీ లోడు యూరియా వస్తే టీడీపీ నాయకులు పంచుకున్నారు. సామాన్య రైతులకు ఎవ్వరికీ యూరియా ఇవ్వలేదు. మరి అలాంటప్పుడు ఈ సొసైటీ వల్ల ఏం ఉపయోగం.

– శిర్లాపు జగన్, రైతు, వీరఘట్టం

పలుకుబడి ఉన్నోళ్లకే ఉపయోగం..



సొసైటీల్లో పలుకుబడి ఉన్న వారికే ఎరువులు ఇస్తున్నారు. సామాన్య రైతులకు ఎరువులు అందని ద్రాక్షే. యూరియా కోసం రైతులు ఇంత ఇబ్బంది పడుతుంటే సొసైటీ వాళ్లు కనీసం పట్టించుకోవడం లేదు. రైతులు పడుతున్న ఇబ్బందులు చూస్తున్నారే తప్ప రైతులకు యూరియా తెచ్చి ఇవ్వడం లేదు. రైతులకు ఉపయోగం లేని ఈ సొసైటీలను మూసివేయాలి.

– పిన్నింటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు, వీరఘట్టం

13,14 తేదీల్లో జనవిజ్ఞాన వేదిక మహాసభలు

వీరఘట్టం: ఈ నెల 13, 14 తేదీల్లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయనగరంలో నిర్వహించనున్నట్లు వేదిక పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి గౌరునాయుడు తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు హాజరవుతున్నారని తెలిపారు. అలాగే సైంటిస్టులు, మాజీ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు హాజరవుతున్నందున ఆసక్తి గల వారంతా సమావేశాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఆర్.ధనుంజయనాయుడు, అలజంగి చిన్నారావు, బోనంగి దుర్గాప్రసాద్, యందవ రాజు పాల్గొన్నారు.